క్లుప్తంగా

లక్ష్మీపేరంటాళ్లు అమ్మవారి మాలధారణ



నందిగామరూరల్: మండలంలోని లింగాలపాడు గ్రామంలో వేంచేసియున్న లక్ష్మీ పేరంటాళ్లు అమ్మవారి ఆలయంలో సోమవారం అమ్మవారి దీక్ష మాలధారణ కార్యక్రమం జరిగింది.తొలుత అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన 30మంది అమ్మవారి భక్తులు మండలం రోజులపాటు దీక్ష మాలధారణ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ నరసింహమూర్తి మాట్లాడుతూ అమ్మ వారి ఆలయంలో మొదటిసారి అమ్మవారి దీక్ష మాలధారణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. దీక్ష చేపట్టిన వారికి గ్రామానికి చెందిన మారం శ్రీనివాసరావు మాలధారణ వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయానికి గోదానం

నందిగామటౌన్: గోదానం అన్ని దానాలకంటే విశిష్టమైనదని ధర్మశాస్త్రాలు చెబుతున్నాయని ఆలయ అర్చకుడు లక్ష్మణాచార్యులు తెలిపారు. పట్టణంలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారి ఆలయానికి కంచికచర్ల మండలం వేములపల్లి గ్రామానికి చెందిన కోయ గిరిధర్, విజయకుమారి దంపతులు సోమవారం గోవును దానంగా అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవును దానం చేయడం ద్వారా పుణ్యగతులను పొందవచ్చన్నారు. ప్రత్యేక పూజలనంతరం దాతలకు ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం

నందిగామరూరల్: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. సత్య దివ్యాంగుల సేవాసమితి ఆధ్వర్యంలో స్థానిక మెయిన్‌బజార్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం వారు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సేవాసమితి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు అభినందనీయమన్నారు. చలివేంద్రం వద్ద తాగునీటితోపాటు రోజూ మధ్యాహ్న 12 గంటలకు మజ్జిగ వితరణ చేస్తున్నట్లు నిర్వాహకుడు రామిరెడ్డి కోటి సూర్యం తెలిపారు. ఏచూరు రాము, జల్లా రవి, మారం అమరయ్య, దేవత విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

బలుసుపాడు రోడ్డులో..

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక బలుసుపాడు రోడ్‌లో దీపావళి మందుల షాపు కూడలిలో జగనన్న కాలనీకి చెందిన ఫ్రెండ్స్ సర్కిల్‌వారు ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ రాజు సోమవారం ప్రారంభించారు. ఫ్రెండ్స్ సర్కిల్‌సభ్యులు జక్కులూరి సురేష్‌బాబు, కనపర్తి సత్యంబాబు, మార్కపూడి బాబు, సుభాష్, ప్రభాకర్, రమేష్‌బాబు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు సవరణలను వ్యతిరేకిస్తూ ముస్లింల నిరసన



షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): వక్ఫ్ బోర్డు చట్ట సవరణలను వ్యతిరేకిస్తూ షేర్‌మహ్మద్‌పేటలో సోమవారం ముస్లిం సోదరులు నల్లబ్యాడ్జీలు ధరించి గ్రామంలో రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలోని మసీదు కమిటీ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ ముస్లింలకు వ్యతిరేకంగా కేంద్రప్రభుత్వం అనేక చట్టాలను చేస్తోందన్నారు. వక్ఫ్ బోర్డు చట్ట సవరణ చేయాలని చూడటం దుర్మార్గమన్నారు. కేంద్రప్రభుత్వం ఇటువంటి విధానాలే అవలంభిస్తే ముస్లింలు పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. చిల్లకల్లు ఎస్సై తోట సూర్యశ్రీనివాస్ అక్కడికి చేరుకుని ఆందోళనకు అనుమతి లేదంటూ ముస్లిం సోదరులను అక్కడి నుంచి పంపించి వేశారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు షేక్ రహీం, అబ్దుల్ సుకూర్, దాదా, నాగుల్, బడేమియా, మస్తాన్, ఫయాజ్ పాల్గొన్నారు. ఆందోళన చేస్తున్న ముస్లిం సోదరులకు సీపీఎం పార్టీ నాయకులు ఎస్.నాగమణి, కోట కృష్ణ, దంతాల వెంకటేశ్వర్లు, షేక్ గౌస్‌మియా, కోట రవికుమార్ మద్దతు తెలిపారు.

కళాకారుల సంక్షేమానికి కృషి చేయాలి

విజయవాడ కల్చరల్: సాంస్కృతిక కళా సంస్థలు కళాకారుల సంక్షేమానికి కృషి చేయాలని మహానటి సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి తెలిపారు. సావిత్రి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికమీద సోమవారం సాంస్కృతిక, కళారంగాలకు చెందిన వారికి సత్కార కార్యక్రమం నిర్వహించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ కళాకారులు సాంస్కృతిక వారధులని చెప్పారు. ఉగాది పురస్కారాల్లో సాంస్కృతిక, కళారంగాలు, గాయనీ గాయకుల విభాగాన్ని చేర్చి వారికి కూడా ఉగాది పురస్కారాలు ఇవ్వాలని సూచించారు. జ్యోతిష్యశాస్త్ర వేత్త ప్రసూనా రామన్ కళాపీఠం చేస్తున్న కృషిని అభినందించారు. చింతకాయల చిట్టిబాబు, గుడిపాటి హరికృష్ణ, శ్యాంప్రసాద్, బీవీ వీరభద్రరావు దేవిడ్‌రాజు, సత్యవర్ధన్, ఆదిరాల జయప్రభ, కొమ్మినేని రత్నకుమారి, వడ్డాది కామేశ్వరి, తబలా చిట్టిబాబు, కొప్పుల అశోక్, చావా నరసింహారావు, కారుమంచి రాజు, అమూలారాణిలను సత్కరించారు.



నందిగామ ఈద్గా వద్ద నమాజ్ చేస్తున్న ముస్లింలు



పెనుగంచిప్రోలు జుమ్మా మసీదులో నమాజులు చేస్తున్న ముస్లింలు



జుజ్జూరులో నమాజ్ చేస్తున్న ముస్లింలు

ప్రేమతత్వానికి నిదర్శనం రంజాన్

నందిగామటౌన్: నందిగామ, జగ్గయ్యపేట నియోజకర్గాల్లోని ముస్లింలు సోమవారం రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేసి ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

నందిగామలో..

నందిగామ పట్టణంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో పవిత్ర రంజాన్ పండుగను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే మసీదులు, ఈద్గాలలో ప్రత్యేక నమాజ్‌లు చేశారు. నందిగామ పట్టణంలోని ఈద్గా వద్ద వద్ద నిర్వహించిన ప్రత్యే నమాజ్‌లో మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పాల్గొన్నారు. ముస్లిం సోదరులను ఆలింగనం చేసుకుని వారికి పండుగ శుభాకంక్షలు తెలిపారు. ఈసందర్భంగా మాజీఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం మనిషికి ఒక క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన, దైవభక్తి పారాయణతో కూడుకున్న జీవన విధానాన్ని అలవాటు చేస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా రంజాన్ పండుగ మనిషిని ఒక ఉన్నత మానవీయ విలువలు కలిగిన వ్యక్తిగా తీర్చిదిద్దటమే కాకుండా సమాజంలో శాంతి, సమానత్వం, సామరస్యం, సోదరభావాలకు పునాది వేస్తుందని వివరించారు. ప్రేమతత్వాన్ని పెంపొందించడమే పవిత్ర రంజాన్ పర్వదిన పరమార్థమని కొనియాడారు. పవిత్ర రంజాన్‌మాసంలో ఆచరించే ఉపవాసం పేదల ఆకలి బాధలు అర్థమవుతాయని. తదార్వా సంపన్నులకు సైతం పేదవారిని ఆదుకోవాలనే ఆలోచన కలుగుతుందని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చల్లా బ్రహ్మేశ్వరరావు,ముస్లిం నాయకులు మహ్మద్ మస్తాన్, షేక్ మున్నా, షేక్ జాఫర్, రజ్వీ, షేక్ సుభానీ, ఎండీ అమీన్, షేక్ యాకుబ్ అలీ, షేక్ సైదా, పలువురు నాయకులు పాల్గొన్నారు.

దాతృత్వానికి ప్రతీక : ఎమ్మెల్యే సౌమ్య

రంజాన్ పండుగను ముస్లింలు సంతోషంగా జరుపుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. పట్టణంలోని ఈద్గా వద్ద ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రంజాన్ పండుగ దాతృత్వానికి ప్రతీకగా పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, నాయకులు యేచూరు రాము, లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చందర్లపాడు మండలంలో..

నందిగామరూరల్: నందిగామ, చందర్లపాడు మండలాల్లోని ముస్లింలు రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. చందర్లపాడు గ్రామంలోని ఈద్గా వద్ద మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వైఎస్‌ఎన్ ప్రసాద్, కందుల నాగేశ్వరరావు, పలువురు ముస్లిం నాయకులు పాల్గొన్నారు.



నందిగామ దర్గాలో నమాజ్ చేస్తున్న మాజీఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు, ముస్లింలు



ముక్త్యాలలో ప్రత్యేక నమాజ్‌లు చేస్తున్న ముస్లింలు



పెండ్యాలలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: రంజాన్ పండుగను మండలంలోని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచే ఈద్గా, మసీదుల వద్ద ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలో జామా మసీదు వద్ద మత గురువు రాహుల్‌రాజా ఆధ్వర్యంలో ప్రత్యేక నమాజ్‌లు నిర్వహించారు. మత ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్ర ఖురాన్ గ్రంథాన్ని చదవడమే కాకుండా గ్రంథంలోని విషయాలను ఆచరించాలన్నారు. అనంతరం మసీదు ప్రెసిడెంట్ చిన్న మీరా హుస్సేన్ 30 మంది పేద ముస్లింలకు దుస్తులు పంపిణీ చేశారు. అదేవిధంగా మండలంలోని అల్లూరు, పెద్దాపురం, జయంతి, నరసింహారావుపాలెం, వీరులపాడు, కొణతాలపల్లి, వెల్లంకి గ్రామాల్లోని రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు.

కంచికచర్ల మండలంలో...

కంచికచర్ల: రంజాన్ సందర్భంగా మండలంలోని పెండ్యాల, కంచికచర్ల, పరిటాల, మోగులూరు, చెవిటికల్లు, గొట్టుముక్కల, కీసర, గండేపల్లి, తదితర గ్రామాల్లోని మసీదుల్లో ముస్లిం సోదరులు సోమవారం ప్రత్యేక నమాజ్‌లు చేశారు. అత్యంత భక్తి శ్రద్ధలతో రంజాన్ జరుపుకుని ఒకరినొకరు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. మతపెద్దలు మాట్లాడుతూ మానవాళికి హితాన్ని బోధించేదే రంజాన్ పర్వదినమన్నారు. సామరస్యం, సుహృద్భావం, సర్వమానవ సమానత్వం, కరుణ, దాతృత్వానికి రంజాన్ పండుగ ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు.

జగ్గయ్యపేట మండలంలో..

జగ్గయ్యపేట: ముస్లింల పవిత్ర పండుగ రంజాన్ పండుగను జగ్గయ్యపేట మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని ముక్త్యాల, షేర్‌మహ్మద్‌పేట, గౌరవరం, చిల్లకల్లు, బండిపాలెం, గండ్రాయి గ్రామాల్లోని మసీదులు, ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక నమాజ్‌లు చేశారు. ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పలువురు ముస్లింలు పేదలకు దుస్తులు, నిత్యావసర సరుకులు, సేమియాలను అందజేశారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి: ముస్లిం సోదరులు రంజాన్ పర్వదినాన్ని సోమవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్ధనలు చేసుకున్నారు. చిట్టేల, వత్సవాయి, భీమవరం, తాళ్లూరు. దబ్బాకుపల్లి, మంగొల్లు గ్రామాలలో ఎక్కువగా ముస్లింలు ఉండడంతో ఆయా గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది. ప్రత్యేక నమాజ్‌ల అనంతరం ముస్లిం సోదరులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు



జగ్గయ్యపేట ఈద్గాలో ముస్లిం సోదరులతో కలసి నమాజ్ చేస్తున్న తన్నీరు నాగేశ్వరరావు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణ ముస్లింలు రంజాన్ పర్వదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. వేకువజామునే ఐదు గంటలకు భక్తిశ్రద్ధలతో నమాజు చేశారు. ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పండుగను పురస్కరించుకొని బంధుమిత్రులకు ప్రత్యేకంగా తయారుచేసిన సేమియా పాయసాలను అందజేశారు. స్థానిక బలుసుపాడు రోడ్డులోని చారిత్రక ఈద్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో మతపెద్ద షేక్ ఇబ్రహీం మౌలానా ఈదుల్ ఫితర్ సందేశమిచ్చారు. ఈద్గా వద్ద ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు, జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, మున్సిపల్‌చైర్మన్ ఆర్.రాఘవేంద్ర తదితర నేతలు పాల్గొని నమాజ్ చేశారు. అనంతరం ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.



పేట ఈద్గా వద్ద ముస్లింలతో కలసి నమాజ్ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య



ఈద్గా వద్ద తన్నీరు నాగేశ్వరరావుతో ముస్లిం సోదరులు

పెనుగంచిప్రోలులో...

రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలు మండల కేంద్రం పెనుగంచిప్రోలులోని పురాతన జుమ్మా మసీదులో ప్రత్యేక నమాజ్‌లు చేశారు. మతపెద్దలు మాట్లాడుతూ ఎదుట వ్యక్తులను ప్రేమించి వారికి సాయపడడమే నిజమైన రంజాన్ అని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ సాయపడే గుణం అలవర్చుకోవాలని చెప్పారు. కొణకంచి, అనిగిండ్లపాడు, ముళ్లపాడు, నవాబుపేట తదితర అన్ని గ్రామాల్లోని ముస్లింలు ప్రత్యేక నమాజ్‌లు చేశారు.

సందడిగా ఈద్గా ప్రాంగణం..

నందిగామ రూరల్: రంజాన్ పర్వదినం సందర్భంగా నమాజ్ అనంతరం పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటూ చిన్నారులు చూపరులను ఆకట్టుకున్నారు. పట్టణంలోని ఈద్గా వద్ద పండుగ సందర్భంగా ముస్లింలు పెద్దసంఖ్యలో పాల్గొని నమాజ్ చేశారు. నమాజ్ చేసేందుకు వచ్చిన ముస్లింలతో ఈద్గా ప్రాంగణంతోపాటు ఈద్గాకు వెళ్లే రోడ్లలో సందడి వాతావరణం నెలకొంది. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే పండుగ కావడంతో ఆయా రాజకీయపార్టీ నాయకులతోపాటు కులమతాలకు అతీతంగా ప్రతిఒక్కరు ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.



ఈద్గా వద్ద ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీఎమ్మెల్యే జగన్‌మోహనరావు



నందిగామ దర్గా వద్ద ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



చందర్లపాడు మసీదులో ముస్లిం నాయకులతో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు



కంచికచర్లలో మసీదు ఆవరణలో ఎస్‌ఐ రాజుతో చిన్నారులు

సీఐ, ఎస్‌ఐలకు సత్కారం

జగ్గయ్యపేటఅర్బన్: శాంతిభద్రల పరిరక్షణలో భాగంగా జగ్గయ్యపేట సర్కిల్‌లో 509 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమంటూ సీపీఐ నాయకులు సోమవారం జగ్గయ్యపేట సీఐ పి.వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలు రాజు, వెంకటేశ్వర్లు అభినందించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో పోలీసు అధికారులను వారు దుశ్శాలువలతో సత్కరించారు.

అనంతరం సీఐ మాట్లాడుతూ ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అంబోజి శివాజీ, పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు, పట్టణ సహాయకార్యదర్శులు మాశెట్టి రమేష్, మహ్మద్‌అసదుల్లా, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి పోతిపాక వెంకటేశ్వర్లు, ఏఐవైఎఫ్ నాయకులు భాను, న్యాయవాది పారా రామారావు, చందు పాల్గొన్నారు.



సీఐ, ఎస్‌ఐలను సన్మానిస్తున్న సీపీఐ నాయకులు

మామిడి హర్షితకు నేతల అభినందనలు



మామిడి హర్షితను అభినందిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య తదితరులు



హర్షిత దంపతులను అభినందిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు తదితరులు

జగ్గయ్యపేటఅర్బన్: ఆంధ్రప్రదేశ్ అమెరికన్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో ప్రపంచ స్థాయిలో నిర్వహించిన ముగ్గులపోటీలో పాల్గొని ద్వితీయ బహుమతి గెలుచుకున్న జగ్గయ్యపేటకు చెందిన మామిడి హర్షితను పలువురు నాయకులు అభినందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు, మాజీ మంత్రి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం, జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తదితరులు హర్షిత గృహానికి వెళ్లి ఆమెను అభినందించారు. జగ్గయ్యపేటకు ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకువచ్చారంటూ కొనియాడారు.

అమెరికన్ అసోసియేషన్ వారిని మంత్రముగ్ధుల్ని చేసే ముగ్గ వేసి రూ.15లక్షలు ప్రైజ్ మనీ సాధించడం అసాధారణ విషయమంటూ హర్షిత, విష్ణు దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ హఫీజున్నీసా ఫిరోజ్, రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి కన్నమాల శామ్యూల్, జిల్లా కార్యదర్శులు షేక్ జుబేర్, వేముల మల్లేశ్వరరావు, రంగాపురం నరసింహారావు, విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్ నంబూరి రవి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసుల బనాయింపు తగదు



కీసరలో జెడ్పీటీసీ సభ్యురాలు ప్రశాంతిని పరామర్శిస్తున్న రాజేష్, శివాజీ, రాయల తదితరులు

కీసర(కంచికచర్ల): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి ప్రజాసమస్యల పరిష్కారాన్ని విస్మరించి, వైఎస్సార్‌సీపీ నాయకులపై కక్షపూరితంగా వ్యవహరిపై అక్రమ కేసులు బనాయిస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్ష్యుడు దండమూడి రాజేష్ మండిపడ్డారు. జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి భర్త రమేష్‌పై కూటమి ప్రజాప్రతినిధులు అక్రమ కేసుపెట్టి జైలుకు పంపించిన నేపథ్యంలో సోమవారం ఆయన కీసరలో ప్రశాంతిని పరామర్శించారు. ఆమెకు ధైర్యం చెప్పారు. ఈసందర్భంగా రాజేష్ మాట్లాడుతూ భర్త చనిపోయిన బాధిత మహిళకు ఆమె తండ్రి ద్వారా ఆస్తిని సంక్రమింపజేయించి ఆర్థిక భరోసా కల్పించడమే రమేష్ చేసిన నేరమా? అని ప్రశ్నించారు.

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రతిపక్ష పార్టీ నాయకులపై కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. అన్ని రోజులు ఒకేలా ఉండవన్నారు. ప్రభుత్వాలు వస్తుంటాయి, పోతుంటాయన్నారు. అప్రజాస్వామిక విధానాలకు పాల్పడుతున్న కూటమి నాయకులకు ప్రజలు భవిష్యత్‌లో తగిన బుద్ధిచెబుతారని పేర్కొన్నారు. జెడ్పీటీసీ ప్రశాంతిని పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఏలూరి శివాజీ, నాయకులు రాయల నరసింహారావు, సయ్యద్ షేక్ మహ్మద్ (ఎంఎఫ్) తదితరులు ఉన్నారు.

శానిటేషన్ మేస్త్రి సేవలు స్ఫూర్తిదాయకం



జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట మున్సిపాలిటీలో 36ఏళ్లుగా శానిటేషన్ విభాగంలో మేస్త్రిగా సేవలందిస్తున్న ఏపూరి తిరుపతయ్య సేవలు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)అన్నారు. శానిటేషన్ మేస్త్రి ఉద్యోగ విరమణను పురస్కరించుకుని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తాతయ్య పాల్గొని తిరుపతయ్య సేవలను కొనియాడారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కౌన్సిలర్లు, ఉద్యోగులతో కలిసి తిరుపతయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామ్మోహనరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, నాయకులు పాల్గొన్నారు.

కౌలురైతు కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్



గోపి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు తదితరులు

జగ్గయ్యపేటఅర్బన్: అప్పుల బాధతో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన వత్సవాయి మండలం కొత్త వేమవరం గ్రామానికి చెందిన మిర్చి కౌలురైతు కస్తూరి గోపి(35) జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ జగ్గయపేట ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు సోమవారం ప్రభుత్వాసుపత్రికి వెళ్లి గోపి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. గోపి కుటుంబానికి ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గోపికి నివాళులర్పించిన వారిలో విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్ నంబూరి రవి, పార్టీ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు నరమనేని వెంకటేష్, ఏఎంసీ మాజీ డైరెక్టర్లు పింగళి నర్సింహారెడ్డి, మన్నె అప్పారావు, దివ్వెల రామారావు తదితరులు ఉన్నారు.